ఎందుకు చెప్తున్నారో గ్రహించలేని గౌరమ్మ - "ఔను" అని వొప్పుకుంది. అప్పుడు -

"వాళ్లేసినదక్షిణ నూర్రూపాయలు దాటి ఉంటాది. అంత సామ్ము మీ కెపుడేనా దక్షిణ వచ్చిందా? వచ్చి ఉండదు. నేను అక్కడ ఉండటం వల్లనే వచ్చింది. నా వల్ల మీకు లాభమొచ్చినప్పుడు - నాకు మీరూ లాభం చూపాలి గదా! అంచేత ఎకరా అరవయి రూపాయిల లెక్కనే నాకు ఉడుపు అవ్వాలి, ఆ లెక్క మీద నూటిరవయి ఇచ్చేను" అని అసలు విషయం వివరించేరు చైర్మేన్ గారు.

గౌరమ్మ ఆ మాటకు ఆశ్చర్యపోయింది. చైర్మేన్ చెప్పిన కన్సెషన్ సిద్ధాంతం విని - "ఓర్నువ్వు సిన్నింటోడివి గాదురో దేవుడి గుడిల దీపమార్పేసి దేవుకొనే గండడివిరో " అనుకుంది. "ఈ దక్షిణ సొమ్ము ఎరవేసి" మొత్తం యీడి తాలూకా యాభయి ఎకరాల పొలానికీ -ఎకరా కిరవయి లెక్కన - ఓలమ్మో! ఎయ్యి రూపాయిలు! ఎయ్యి రూపాయిలు మింగీడానికి సూత్తన్నావురా ముంగిపోతా" అని గ్రహించింది గౌరమ్మ. గ్రహించేక -

" అది గయిరమ్మ సంబరానికి..... మామునర్దుకోడానికి కాదు" అని దక్షిణ సొమ్ము ఎంతయినా - కూలీలకు సంబంధం లేదని చెప్పింది: సంబరం కోసమే అంది.

"కాదు నీ వాద వేఁవిటీ?" విసుగు ప్రదర్శనకు దిగేరు చైర్మేన్ గారు, అలాంటి ప్రదర్శనకు కూలీలు భయపడి పోతారనే సైకాలజీ గ్రహించి. కానీ, గౌరమ్మ ఆ సైకాలజీకి అందనిది. అందుకే కరుకుగా -

"వోదవేఁటి? వోదఁవ్? కూల్లు తగ్గించేసి కవుర్లు మీరు సెప్తన్న. తిరగ వోదవంతారేటీ? ఎనభయిలెక్కన - కూల్లు ఇచ్చేయండి, వోదఁవ్ గీదఁ వొద్దు" అంది.

ఆ మాటకు చైర్మేన్ కొద్దిగా అహం దెబ్బతిన్నట్టు పీలయినా - సర్దుకుని, మేస్త్రీలకు కమీషనిస్తే లొంగుతారనే మరో సైకాలజీ థీరీ లోంచి ఆలోచించి-"రైతుల్తో - అటూ ఇటుగా సర్దుకుపోతే - బాగుపడతావు" అని ఉపోద్ఘాతం చెప్పారు.

అది ఏ దారి తీసుకెల్దాదో తన కనవసరం - అని భావించి గౌరమ్మ - చైర్మేన్ ఉపోద్ఘాతానికి ఉలకా, పలకా లేదు.

"అయినా యిప్పుడు నే నడిగిన ఇరవయి రూపాయిల కన్సెషన్‌ల... పది నీదీ, పది నాదీ చేసుకుందాం. యేఁవంటావు" అని ఎరవేశారు చైర్మేన్ గారు.

ఆ ఎర అర్థం అయ్యేసరికి, కోపం నసాళాని కెక్కింది గౌరమ్మకు. మనిషి ఊగిపోతూ -

"నాకు ఎంగిలి కూడు జల్లుతావా? నన్ను నమ్మి నా యెనకాల వొచ్చి, నడుము లొంచి పన్సేనీ వోళ్ల నోల్లు కొట్టమంతావా? అది నువ్వూ నేనూ సర్దుకుందామంతావా? త్పూత్! మీ బుద్దులు బుగ్గయిపోను మీరు ఇలాగే కమీసన్ల కింద సంపదంత సర్దుకోబట్టే - కుదబలిసిపోనారు. పెజిలు మాత్రం సిదిగిపోనారు. నా కేటి ఊళ్లేలాలనీ, మేడలూ మిద్దిలూ కట్టీయాలనీ లేదు. నీలాటి బుద్దులుంటే - నన్ను నమ్మినోలు ఈనాడు గాపోతే మరోనాడు నోటిల ఊసెత్తారు. ఊస్సినా.... తుడిసీసికుని బతకటం మీ కలవాటు గానీ - నాక్కాదు. మా కూల్లు మాకు మరియేదగిచ్చియండి " అని జలకడిగీసింది గౌరమ్మ!

